
# డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే దీక్షలు




## స్వచ్ఛందంగా పాల్గొంటున్న ప్రజలు
## ఈడంపింగ్ యార్డుతో నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాలకు తీవ్రనష్టం

**గుమ్మడిదల రూరల్, మార్చి 2 సిరి న్యూస్**

డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మండల కేంద్రమైన గుమ్మడిదలతో పాటు నల్లవల్లి కొత్తపల్లి గ్రామాలలో రిలే నిరాహార దీక్షలను యధావిధిగా కొనసాగిస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు డంపింగ్ యార్డ్ పనులను నిలిపివేసినప్పటికీ తార్ రోడ్ గేటు పనులు మాత్రం పూర్తయినాయి. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదేశాలను జారీ చేసినప్పటికీ గ్రామస్థుల నుండి ఆందోళన వ్యక్తం కావడంతో పనులను నిలిపివేశారు. నల్లవల్లి గ్రామంలో గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రిలే దీక్షలో ఉదయం నుండి సాయంత్రం వరకు పాల్గొంటున్నారు నిత్యం పనులను వదులుకొని డంపింగ్ యార్డ్ ను తరిమికొట్టే వరకు ఉద్యమాన్ని నిలిపి వేసేది లేదంటూ ఆందోళన చేపడుతున్నారు. ఉదయం నుండి నిద్రించే వరకు ఏ నూట విన్న నల్లవల్లి గ్రామంలో డంపింగ్ యార్డ్ గురించి చర్చ నడుస్తుంది.

### రిలే దీక్షలో కురుమ సంఘం సభ్యులు..

డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలో భాగంగా గుమ్మడిదల కురుమ సంఘం సభ్యులు ఆదివారం పాల్గొన్నారు. రోజువారీగా అన్ని కుల సంఘాలతో పాటు స్వచ్ఛందంగా యువత ముందుకు వచ్చి రిలే నిరాహార దీక్షలో పాల్గొంటున్నారు.

### నల్లవల్లి ప్యారా నగర్ గ్రామాలకు భారీగా నష్టం..

ఈ డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల భారీగా నష్టం జరిగే గ్రామాలు నల్లవల్లి ప్యారా నగర్. ఈ గ్రామాలకు కూతవేటు దూరంలోనే వ్యర్థ పదార్థాలతో కూడిన చెత్తాచెదారం వేయడం వలన దుర్గంధపూరితమైన దుర్వాసనలు రావడంతో చాలా ఇబ్బందికరంగా మారుతుంది. ప్రస్తుతం జవహర్ నగర్ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ రెండు గ్రామాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# వైభవంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం

## ప్రత్యేక పూజలు చేసిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి





**పెద్ద శంకరంపేట, మార్చి 2 (సిరి న్యూస్):**

పెద్ద శంకరంపేట పట్టణ శివారు లోని కట్ట మైసమ్మ, గురుపాద గుట్ట శివాలయం ఆవరణలో ఆదివారం సాయంత్రం భ్రమరాంబ మల్లికార్జున స్వామిల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో, మంగళ వాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్య అతిథి గా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ మండపాన్ని వివిధ రకాల పూలతో, అరటి మట్టెలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవ విగ్రహాలకు వేద బ్రాహ్మణ పండితుల ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ప్రజలు భక్తులు తరలివచ్చి స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

### ఘనంగా బండ్ల ఊరేగింపు..

గురుపాద గుట్ట శివాలయం జాతర ఉత్సవాలు భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఎద్దుల బండ్లు చీరలు రవికలు, దేవత మూర్తులు చిత్ర పటాలతో, మామిడి కొమ్మలు, వేప కొమ్మలతో సర్వాంగ సుందరంగా అలంకరించి శివాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేయించారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు,ఆలయ కమిటీ బృందం ఆయా గ్రామాల గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దత్తాత్రేయ పంచమ వార్షికోత్సవానికి ఆహ్వానం

**సదాశివపేట, మార్చి 2 (సిరి న్యూస్)**



సదాశివపేట పట్టణంలోని శ్రీ స్థానిక మాణిక్ ప్రభు మందిరం ఆలయ పాంగణంలో నెలకొల్పిన శ్రీ దత్తాత్రేయ పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రోజున శ్రీ సద్గురు బాలమార్తాండ మహారాజ్ చయనయాజి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, కలశాల ఊరేగింపు, గీతా పారాయణం, , రాత్రి 7గం.లకు దత్తాత్రేయుని పల్లకి సేవ సదాశివపేట పట్టణంలోని పురవీధుల గుండా నిర్వహించబడుతాయని, ఆలయ ప్రాంగణంలో తెల్లవారుజామున భజన కార్యక్రమము వెంకటాపురం భజన మండలిచే నిర్వహించబడునని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

# పిల్లల్లో దేశభక్తిని పెంపొందించాలి

## గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్


**గుమ్మడిదల, మార్చి 2 సిరి న్యూస్**




పిల్లల్లో దేశభక్తి పెంపొందించాలంటే రాజుల వీరుల పోరాటాల గురించి వారికి ధైర్య శౌర్య పరాక్రమాల గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుమ్మడిదల మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీలోని శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాలలో అఖండ భారత్ పేరున సాంస్కృతిక కార్యక్రమాలను ప్రిన్సిపల్ లత అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్ మాట్లాడుతూ పిల్లలు తరచూ తరగతి గదికే పరిమితం కాకుండా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడా కార్యక్రమాలకు కూడా తన నైపుణ్యంను ప్రదర్శించాలని అన్నారు. మార్పు అన్నది ఒక్క రోజుల్లోనే సాధ్యం కాదు కాబట్టి పరంపరగా మనం మారితే మన భవిష్యత్ తరాలు మారుతాయని అన్నారు. చిన్నతనం నుండే పిల్లలకు వీర గాధలు వింటూ పెరిగితే దేశం పట్ల ప్రేమ గౌరవం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, చైర్మన్ మల్లారెడ్డి, కరస్పాండెంట్ జైపాల్ రెడ్డి, మల్లేష్ యాదవ్, ఆంజనేయులు యాదవ్, జైపాల్ రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

# వివాహ వేడుకలకు హాజరైన జర్నలిస్టులు

**రామాయంపేట మార్చి 2 (సిరి న్యూస్)**



రామాయంపేట పట్టణ కేంద్రంలో గల మెహర్ సాయి ఫంక్షన్ హాల్ లో జరిగిన రిపోర్టర్ తుజాల శ్రీనివాస్ గౌడ్ కూతురు వివాహానికి హాజరైన టియుడబ్ల్యూజే విలేకరులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో టియుడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డిజి శ్రీనివాస్ శర్మ, అధ్యక్షులు బసనపల్లి మల్లేశం, దేవ రాజు, రాజా కిషన్, మర్కు నగేష్, రామారావు యాదగిరి ు పాల్గొన్నారు.